ప్రజాశక్తి
శుక్రవారం 27 అక్టోబర్ 2023
5
పార్వతీపురం మన్యం

ఎపి పోస్టల్ కబడ్డీ జట్టు కోచ్‌గా శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 30 నుంచి నవంబర్ 2 వ తేదీ వరకు కేరళ రాష్ట్రం ఎర్నాకులం లో జరగబోయే 35వ ఆలిండియా పోస్టల్ కబడ్డీ టోర్నమెంట్ లో పాల్గొనబోయే ఆంధ్రప్రదేశ్ పోస్టల్ కబడ్డీ జట్టుకు కోచ్‌గా విజయనగరం హెడ్ పోస్ట్ ఆఫీస్ లో ఉద్యోగం చేస్తున్న కబడ్డీ క్రీడాకారుడు పతివాడ శ్రీనివాస రావును నియమిస్తూ విజయవాడ సర్కిల్ ఆఫీస్ నుండి ఉత్తర్వాలు వచ్చాయి. శ్రీనివాసరావు 1997 నుండి పలు జాతీయ పోటీల్లో పాల్గొని ఎన్నో పతకాలు సాధించారు. ఆంధ్రప్రదేశ్ జట్టుకు కెప్టెన్‌గా పలుమార్లు వ్యవహరించారు. శ్రీనివాస రావు నియామకం పట్ల జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కార్యదర్శి ఈశ్వర్ కౌశిక్ , సూరిబాబు , కబడ్డీ గురువు బొమ్మన రామారావు, తపాలా శాఖ సిబ్బంది అభినందించారు.

ప్రభుత్వం రిజర్వు చేసిన భూముల్లో నుంచి వేసిన రహదారి

ఎయిర్‌పోర్టు అదనపు భూముల్లో అడ్డగోలు రహదారి

రిసార్ట్ సంస్థ కొత్తగా వస్తున్న లేఔట్‌కు అనుసంధానం చేసిన రహదారి

ఉత్తరాంధ్ర జిల్లాల్లో పర్యటనలకు వచ్చే ప్రభుత్వ పెద్దలైనా.. అధికారులైన భోగాపురం మండలంలోని అత్యంత ఖరీదైన ప్రముఖ రిసార్ట్‌లోనే సేద తీరుతుంటారు. అది పగలైనా రాత్రైనా. అందుకేనేమో.. ఇంకెవడ్రా మనల్ని అపేది అనుకుందేమో ఆ రిసార్ట్ సంస్థ. ప్రజల సొమ్ముతో ప్రభుత్వం పరిహారం అందజేసి విమానాశ్రయం కోసం సేకరించిన భూముల నుంచి ఎటువంటి అనుమతులూ లేకుండానే ఏకంగా ఆ రిసార్ట్ సంస్థ తాము కొత్తగా వేస్తున్న వ్యాలీ అనే రియల్ ఎస్టేట్ వెంచర్‌కు అడ్డగోలుగా గ్రావెల్ రోడ్డును దిబ్బలపాలెం సమీపంలో నిర్మించుకుంది. అదికూడా త్వరలో నిర్మించబోయే బీచ్ కారిడార్ రోడ్డునుంచి నేరుగా తమ వెంచర్ వరకు వేసేశారు. మరి ఇంత అడ్డగోలుగా ఆ సంస్థ తమ సొంత యంత్రాలతో గత కొన్ని రోజులు నుంచి నిర్మిస్తుంటే అధికారులు మాత్రం కళ్లకు గంతలు కట్టుకోవడం విశేషం. భోగాపురం మండలంలో ఆ రిసార్ట్ సంస్థ చేస్తున్న అడ్డగోలు వ్యవహారం ఇది. వివరాల్లోకి వెళితే...

- అనుమతులు లేకుండానే 3 కిలోమీటర్లు రహదారి నిర్మాణం
- ఓ రిసార్ట్ సంస్థ నిర్వాకం
- సేదతీరిన రిసార్ట్ రుణం తీర్చుకుంటున్న పెద్దలు, అధికారులు

ప్రజాశక్తి-భోగాపురం

భోగాపురం మండలంలో విమానాశ్రయ నిర్మాణానికి ప్రభుత్వం సుమారు 2700 ఎకరాలు భూములను సేకరించింది. సేకరించిన భూముల్లో సుమారు 500 ఎకరాలు ప్రభుత్వం ఐటి కంపెనీలకు, ఇతర అవసరాలకు రిజర్వులో ఉంచింది. ఈ భూమికి పడమర వైపు ఈ రిసార్ట్ సంస్థ కొత్తగా వ్యాలీ పేరుతో వెంచర్ వేస్తోంది. ఈ వెంచర్‌కు సుమారు 3కిలో మీటర్లు దూరంలో కొత్తగా నిర్మించబోయే బీచ్ కారిడార్ రోడ్డు ఉంది. ఈనేపథ్యంలో దిబ్బలపాలెం వెళ్లే రహదారికి నేరుగా ప్రభుత్వం అట్టిపెట్టుకున్న 500 ఎకరాల్లో నుంచి గత కొన్ని రోజులుగా సుమారు 40అడుగుల విస్తీర్ణంతో రహదారిని నిర్మించేశారు. ఈ రహదారి బీచ్‌కు ఆనుకొని మరో పెద్ద వెంచర్ ఈ సంస్థకు ఉంది. అయితే ఈ రెండింటికి అనుసంధానం చేసేలా అడ్డగోలుగా ఈ భూముల్లో నుంచి రహదారిని నిర్మించేశారు.

అనుమతులు లేకుండా..

ప్రభుత్వం అట్టి పెట్టుకున్న భూముల్లో నుంచి తమ వెంచర్‌కు రహదారిని నిర్మించేందుకు వీరికి ఎటువంటి అనుమతులు లేవు. కాని ఏకంగా తమ సొంత వాహనాలతో రహదారిని నిర్మించడం గమనార్హం. పోనీ విమానాశ్రయం పనులు జరుగుతున్నాయి అందుకోసం ఈ రహదారిని నిర్మించుకున్నారంటే ఈ భూములకు విమనాశ్రయం నిర్మాణానికి ఎటువంటి సంబంధమూ లేదు. అంతేకాక ఇంకా నిర్మించబోయే విమానాశ్రయం ప్రహరీ గోడ పక్క నుంచి ఈ రహదారిని నిర్మించారు. అంటే కేవలం తమ రియల్ ఎస్టేట్ వెంచర్‌లోని ప్లాట్లను అమ్ముకోవడానికి, ఈ రహదారి నేరుగా బీచ్‌కు వెళ్తుందని చూపించడానికి ఈ రహదారిని నిర్మించారన్న విమర్శలు వస్తున్నాయి. ఇంతలా జరుగుతున్నా అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడకపోవడం విశేషం.

కొత్తగా వేస్తున్న లేఔట్

రహదారిని పరిశీలించి చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వం అట్టిపెట్టుకున్న భూముల్లో నుంచి రహదారిని వేస్తున్న వ్యవహారం మా దృష్టికి రాలేదు. ఆ రహదారికి అనుమతులు ఉన్నవీ లేనివీ పరిశీలిస్తాం. అవసమైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి రహదారిని నిర్మాణాన్ని నిలిపివేస్తాం.

\- చింతాడ బంగార్రాజు, తహశీల్దారు, భోగాపురం

గిరిజనులకు బురిడీ

- వ్యవసాయ పనిముట్లు ఇస్తామని మోసం
- గిరిశిఖర గ్రామాల్లో రూ.లక్షలు వసూలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు

మోసపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి-సాలూరు

మండలంలోని గిరిశిఖర గ్రామాల్లో అనేక మంది గిరిజన రైతులను కొంతమంది వ్యక్తులు బురిడీ కొట్టించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ట్రాక్టర్, ఇతర వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేస్తామని చెప్పి రూ.లక్షల్లో డబ్బులు వసూలు చేసి పరారయ్యారు. గంజాయిభద్ర పంచాయతీ పరిధిలో ఉన్న ఎగువశెంబి, దిగువశెంబి, దూళిభద్రతోపాటు ఇతర గిరిశిఖర గ్రామాల్లో రైతులకు మాయమాటలు చెప్పి లక్షల రూపాయలు గుంజుకున్నట్లు గిరిజనులు వాపోతున్నారు. దిగువశెంబి గ్రామానికి చెందిన కూనేటి రాజేష్, కూనేటి నర్సు, కూనేటి ఉత్తర, కూనేటి డోంబురు, ఎగువ శెంబికి చెందిన తాడంగి చిరంజీవి నుంచి డబ్బులు వసూలు చేశారు. వీరిలో దిగువ శెంబి గ్రామానికి చెందిన కూనేటి రాజేష్ రూ.58 వేలు ఇచ్చి మోసపోయాడు. పేదల గృహ నిర్మాణంలో భాగంగా తన ఇంటికి మంజూరైన రూ.58 వేల బిల్లు మొత్తాన్ని ట్రాక్టర్ ఇస్తారని భావించి చెల్లించానని కూనేటి రాజేష్ ఆవేదన వ్యక్తం చేశాడు. మిగిలిన రైతుల నుంచి 12,500 రూపాయలు వసూలు చేసినట్లు తెలిపారు. దూళిభద్ర గ్రామానికి చెందిన రైతుల నుంచి కూడా 73 వేల రూపాయలు వసూలు చేశారని చెపుతున్నారు. మండలంలోని గంజాయిభద్ర గ్రామాల నుంచి కూడా వసూలు చేశారని చెప్పారు. ట్రాక్టర్, పవర్ టిల్లర్ వంటి వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేస్తామని నమ్మబలికి వసూలు చేశారని గిరిజన రైతులు రాజేష్, నర్సు వాపోయారు.

నెల్లూరు జిల్లాకి చెందిన వాసు నాయుడు, కిసాన్ క్రాఫ్ట్ సూపర్ వైజర్‌నని చెప్పుకున్న ఎన్.శ్రీనివాస్ అనే ఇద్దరు వ్యక్తులు తమ గ్రామానికి మోటార్ సైకిల్‌పై వచ్చి డబ్బులు వసూలు చేశారని తెలిపారు. మూడు నెలల క్రితం డబ్బులు వసూలు చేసి పరారయ్యారని, ఫోన్ చేస్తే ఎత్తడం లేదని వాపోయారు. ఈ విషయంపై మూడు నెలల క్రితం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, ఇంతవరకూ చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తంచేశారు. మూడు సార్లు పోలీస్ స్టేషన్‌కి వెళ్ళినా స్పందించలేదని చెప్పారు. తమకు న్యాయం చేయాలని గిరిజన రైతులు కోరుతున్నారు.

విశాఖ జెడ్‌పి సిఇఒగా పోలినాయుడు

గరుగుబిల్లి : మండలంలో ఉల్లిభద్ర గ్రామానికి చెందిన మరడాన తవిటి నాయుడు కుమారుడు పోలినాయుడు విశాఖపట్నం జిల్లా పరిషత్తు సిఇఒగా నియమితులయ్యారు. మాడుగుల ఎంపిడిఒగా విధులు నిర్వర్తిస్తూ, ఏడాది క్రితం డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడు ఒఎస్‌డిగా పనిచేశారు. ఎంపిడిఒగా పనిచేసిన పోలినాయుడు ఆయా మండలాలలో అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కుటుంబ సభ్యులు తెలిపారు. పోలినాయుడుకు ఉద్యోగోన్నతి లభించడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తంచేశారు.

నేడు గుమ్మలక్ష్మీపురంలో జగనన్నకు చెబుదాం

గుమ్మలక్ష్మీపురం : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ రాములమ్మ తెలిపారు. కలెక్టర్ నిశాంత్ కుమార్ ప్రజల నుంచి వినతలు స్వీకరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైసిపి బస్సుయాత్ర పేరుతో మళ్లీ మోసం

మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

బడుగు, బలహీన వర్గాల అభివృద్ధిపై అధికార పార్టీ నాయకులు ఇన్నాళ్లు గాఢ నిద్రలో ఉండి.. మళ్లీ మోసం చేసేందుకు బస్సు యాత్ర అంటున్నారని పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు విమర్శించారు. గురువారం కృష్ణపల్లిలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నాలుగున్నరేళ్లుగా గుర్తుకురాని బిసి, ఎస్‌సి, ఎస్‌టిలు.. అధికార చరమాంకంలో గుర్తుకొచ్చారా? అని ప్రశ్నించారు. బస్సు యాత్రల పేరిట వైసిపి చేస్తున్న మోసాలను ప్రజలు తప్పక గమనిస్తారని అన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలకు సంబంధించిన 27 సంక్షేమ పథకాలను అటకెక్కించి, కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేయడం ద్వారా వారికి తీరని ద్రోహం తలపెట్టారని ఆగ్రహం వ్యక్తంచేశారు. దారి మళ్లించిన ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధుల గురించి సమాధానం చెప్పి వైసిపి బస్సు యాత్ర చేపట్టాలని డిమాండ్ చేశారు.

వైద్య సేవలపై కలెక్టర్ ఆరా

వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి -సాలూరు

పట్టణంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. శిబిరంలో ఏర్పాటు చేసిన కౌంటర్లు, రిజిస్ట్రేషను, టోకెను జారీ విధానం, వైద్యులు, సిబ్బంది హాజరు, చికిత్స కోసం వచ్చిన ప్రజలు, వైద్య సేవలను ఆయన నిశితంగా పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని సూచించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిరుపేదలు, దూర ప్రాంతాల ప్రజలకు గొప్ప వరమని, నిపుణులైన వైద్యులు ప్రజల వద్దకే వచ్చి వైద్యసేవలు అందిస్తున్నారని వివరించారు. ప్రజలకు ఇంటివద్దే బిపి, మధుమేహం, రక్తహీనత, మూత్రం, మలేరియా, డెంగీ, కఫం పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబరు 30 నుండి వచ్చే నెల పదో తేదీ వరకు 287 వైద్య శిబిరాలు జిల్లాలో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా 84 మంది ప్రత్యేక వైద్య నిపుణులు పాల్గొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేదల కోసం ఉచితంగా అందించే ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జిల్లాలో ఇప్పటి వరకు సుమారు లక్షా ఏడు వేల మంది వైద్య సేవలు పొందారని ఆయన చెప్పారు. 11,094 మందికి మధుమేహం, 17,818 మందికి బిపి ఉన్నట్లు గుర్తించారని తెలిపారు. జీవన శైలిలో మార్పుల కారణంగా ఇటువంటివి వ్యాప్తి చెందుతున్నాయని, వాటి పట్ల అవగాహన కల్పిస్తున్నారని వివరించారు. 53,531 లాబ్ టెస్టులు చేసినట్లు ఆయన వెల్లడించారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను తనిఖీ చేశారు. శిబిరానికి వచ్చే అందరికీ ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, రక్తహీనతతో బాధపడుతున్న వారికి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, కమిషనర్ టి.జయరాం, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ శివకుమార్, వైస్ ఛైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు, మెడికల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కూనేరు చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేస్తున్న ఎస్‌ఇబి డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి

ఎఒబిలో కట్టుదిట్టంగా నిఘా

- ఎస్‌ఇబి డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి
- ఆకస్మికంగా రాష్ట్ర చెక్ పోస్టుల తనిఖీ

ప్రజాశక్తి-కొమరాడ,పాచిపెంట

ఎఒబి సరిహద్దు ప్రాంతాల్లో నిరంత తనిఖీలు ముమ్మరం చేస్తున్నట్లు ఎస్‌ఇబి డిప్యూటీ కమిషనర్ పి.శ్రీదేవి తెలిపారు. గురువారం ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతంలోని కూనేరు, పి.కోనవలస చెక్‌పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనాలను నిరంతరం తనిఖీ చేయాలని ఆమె సూచించారు. గంజాయి, అక్రమ మద్యం, సారా లాంటి నిషేధిత పదార్థాలను ఆంధ్ర ప్రాంతానికి రాకుండా నిరోధించాలని ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఇబి ఇన్‌స్పెక్టర్ ఎల్.ఉపేంద్ర పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కల్పనకుమారి

గిరిజన ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం

ఐటిడిఎ పిఒ కల్పనకుమారి

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఐటిడిఎ పరిధిలో విడివికెల్లోని గిరిజన ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి అన్నారు. గురువారం వైకెపి, జిసిసి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. విడివికెల అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకొంటామన్నారు. ఆమోదం బ్రాండ్ పేరుతో పట్టణాల్లో మార్కెటింగ్ సౌకర్యం కల్పించుటకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గిరిజన ఉత్పత్తుల ప్యాకింగ్ ఆకర్షించే విధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ రోసిరెడ్డి, జిసిసి డిఎం సంధ్యారాణి, ఎపిడి రమణ, ఎపిఎంలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకార భరోసా ఇవ్వాలి

ప్రజాశక్తి-పాచిపెంట

పెద్దగెడ్డ జలాశయం ఆధారంగా జీవనం సాగిస్తున్న గిరిజన మత్స్యకారులకు మత్స్యకార భరోసా ఇవ్వాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మండలంలోని కేసలి గ్రామంలో గిరిజన మత్స్యకారులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. గత కాంగ్రెస్, టిడిపి ప్రభుత్వాల హయాంలో 90 శాతం సబ్సిడీతో వలలు, మోపెడ్లు, లైఫ్ జాకెట్లు ఇచ్చారని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం సబ్సిడీలు ఎత్తివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. బయట వల కొనాలంటే రూ.8 వేలకు పైగా ఖర్చవుతోందన్నారు. ఇప్పటికైనా సబ్సిడీతో వలలు, మోపెడ్లు, ఇతర సామగ్రి అందించాలని, రుణాలు మంజూరు చేయాలని కోరారు. పెద్దగెడ్డ జలాశయంలో ఎకరాకు వెయ్యి చేపపిల్లలు వేయాలని నిబంధన ఉందన్నారు. అలా వేయకపోవడంతో జలాశయంలో చేపలు లేక, బతుకుతెరువు కష్టమైందని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో గిరిజన నిర్వాసిత మత్యకారులు జర్నీ పోలయ్య, బద్నాన ముసలయ్య, చిన్నారావు, నారాయణరావు, సుంకి, జర్నీ కొండలరావు పాల్గొన్నారు.

పట్టణ ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

ప్రధాన రహదారిపై గోతులు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలో ప్రధాన రహదారిపై ఎక్కడికక్కడ భారీ గోతులు ఏర్పడ్డాయి. రాయగడ రోడ్డు జంక్షన్ నుండి పట్టణ శివారులో ఉన్న డంపింగ్ యార్డు వరకు ప్రధాన రహదారి పొడవునా పెద్దపెద్ద ఉగోతులున్నాయి. ద్విచక్రవాహనదారులతోపాటు ఆటో కార్మికులు ఈ రహదారిపై ప్రయాణం సాగించాలంటే భయపడుతున్నారు. ఈ గోతుల కారణంగా రాత్రివేళ్లలో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. జిల్లా కేంద్రంలో ప్రధాన రహదారి పరిస్థితి ఇలా ఉండటంపై ఆర్అండ్‌బి అధికారుల తీరుపై బహిరంగంగానే విమర్శలు వినిపిస్తున్నాయి. నిత్యం జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిదులు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకోకపోవడంపై పట్టణ ప్రజలు పెదవి విరుస్తున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రజారక్షణ భేరి విజయవంతానికి ప్రచారం

ప్రజాశక్తి - కురుపాం

సిపిఎం చేపట్టిన ప్రజారక్షణ భేరి బస్సు యాత్రను జయప్రదం చేయాలని కోరుతూ ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ఆధ్వర్యాన గురువారం కురుపాం సంతలో ప్రచారం నిర్వహించారు. ముందుగా సిపిఎం ప్రజా ప్రణాళిక పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారపు సంతలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర రాజకీయాలు సొంత అజెండాల చుట్టూ తిరుగుతున్నాయని తెలిపారు. వీటిని ప్రజా సమస్యల చుట్టూ మళ్లించాలనే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. దీనిలో భాగంగా ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 30న ప్రజా రక్షణ భేరి బస్సుయాత్ర భాగంగా కురుపాంలో నిర్వహించే బహిరంగసభకు సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హాజరవుతారని తెలిపారు. ఈ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కోలక అవినాష్, కొల్లి గంగునాయుడు, ఎం.శ్రీనివాసరావు, కోరంగి సీతారాం తదితరులు పాల్గొన్నారు.

కురుపాంలో ప్రజా రక్షణ భేరి పోస్టర్, ప్రజా ప్రణాళిక బ్రోచర్‌ను విడుదల చేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, తదితరులు

గుమ్మలక్ష్మీపురం : సిపిఎం ప్రజా రక్షణ భేరి బస్సుయాత్ర విజయవంతానికి గురువారం జియ్యమ్మవలస మండలంలో ఆ పార్టీ నాయకులు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రక్షణభేరి పోస్టర్‌ను సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొల్లి గంగునాయుడు విడుదల చేశారు. 30న కురుపాంలో నిర్వహించే సభకు సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు హాజరవుతున్నారని చెప్పారు. ప్రజలంతా హాజరై సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కోరంగ సీతారాం, నాయకులు భూతాల మోహనరావు, గరుగుబిల్లి శ్రీనివాసరావు, గరుగుబిల్లి రాజు, సామయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సాలూరు : ఈ నెల 31న పట్టణానికి వస్తున్న ప్రజారక్షణ భేరి బస్సు యాత్రని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్‌వై నాయుడు కోరారు. యాత్ర గురించి పట్టణంలోని 6, 7, 8 వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆధ్వర్యాన నిర్వహిస్తున్న రక్షణ భేరి యాత్ర 31న మధ్యాహ్నం 12 గంటలకు సాలూరు పట్టణానికి చేరుతుందని చెప్పారు. ఈ యాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు అర్జున్ పాల్గొన్నారు.

కొమరాడ : మండలంలోని కోనవలస, డంగభద్ర గ్రామాల్లో సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ఆధ్వర్యాన బస్సుయాత్రను విజయవంతం చేయాలని ప్రచారం చేశారు. సిపిఎం నాయకులు హెచ్.రామారావు, తదితరులు పాల్గొన్నారు.

సాలూరులో ప్రచారం చేస్తున్న సిపిఎం జిల్లా నాయకులు ఎన్‌వై నాయుడు

రహదారిపై గుంతల్లో చేరిన నీటిని చూపిస్తున్న సిపిఎం నాయకులు కోరాడ ఈశ్వరరావు

రహదారికి మోక్షమెప్పుడు?

ప్రజాశక్తి-పాచిపెంట

మండల కేంద్రంలో ప్రధాన రహదారికి మోక్షం లభించడం లేదు. చిన్నపాటి వర్షం పడినా రహదారిపై గోతుల్లో నీరు చేరడంతో ప్రజలంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదేమార్గంలో రాకపోకలు సాగిస్తున్న అధికారులు సైతం ఏమీ పట్టినట్టుగా రోడ్డుపై గుంతలు కప్పడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సిఎం రాజన్నదొర దృష్టికి స్థానికులు రోడ్డు సమస్యను తీసుకెళ్లారు. అయినా నేటికీ సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పటికైనా పాచిపెంట మండల కేంద్రంలో ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేసి, కాలువ నిర్మాణం చేపట్టాలని సిపిఎం నాయకులు కోరాడ ఈశ్వరరావు, కెవిపిఎస్ నాయకులు కె.అప్పలస్వామి, గౌరీశ్వరరావు కోరారు.

వ్యాసరచన పోటీలను పర్యవేక్షిస్తున్న ఎస్ఐ షణ్ముఖరావు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్విన్‌పేట ఎస్ఐ షణ్ముఖరావు మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల సేవలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బిడ్డిక భీముడు, ఉపాధ్యాయులు బి.మురళీధర్, సీతం నాయుడు ఉన్నారు.

31న కోరన్న, మంగన్న వర్ధంతి సభ

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

శ్రీకాకుళం సాయుధ రైతాంగ పోరాటవీరులు కోరన్న, మంగన్న వర్ధంతి సభను ఈ నెల 31న గుమ్మలక్ష్మీపురంలో నిర్వహిస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి తోట జీవన తెలిపారు. ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హాజరవుతున్నట్లు తెలిపారు.

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో నా దేశం- నా మట్టి కార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. వివిధ గ్రామాల నుండి సేకరించిన మట్టిని ఊరేగిస్తూ విద్యార్థులు దేశభక్తి నినాదాలు చేశారు. కళాశాల విద్యార్థులు, ఎస్ఐబి సిఐ ఉపేంద్ర, నెహ్రూ యువ కేంద్రం ప్రతినిధి పైడాన శ్రీనివాసరావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌టిసి కార్గో డోర్ డెలివరీ ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఆర్‌టిసి ప్రవేశపెట్టిన కార్గో డోర్ డెలివరీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు కోరారు. స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద ఉన్న పార్సిల్ రవాణా కార్యాలయం వద్ద గురువారం కమర్షియల్ ఎటిఎం దివ్యతో కలిసి డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ అతి తక్కువ చార్జీలతో ఆర్టీసీ కార్గో సేవలను ప్రజలలోకి తీసుకుని వెళ్లే సదుద్దేశ్యంతో ఈనెల 26 నుంచి నవంబర్ 25వరకు మాసోత్సవాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నగరం లోని ప్రజలు, వ్యాపార సంస్థలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

మాలతమ్మకొండపై దసరా వేడుకలు

ప్రజాశక్తి - కురుపాం :

మండలంలో బియ్యాలవలస పంచాయతీ దురిబిలి గ్రామంలో మాలతమ్మ కొండపై గిరిజన సంప్రదాయాలతో గురువారం దసరా పండుగను నిర్వహించారు. తరతరాలుగా వస్తున్న ఆచారం ప్రకారం దసరా పండగ అనంతరం మాలతమ్మ కొండ వద్ద దసరా పూజలు చేసుకుంటామని గిరిజనులు తెలిపారు.

15 వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి-వీరఘట్టం

వీరఘట్టంలోని కోదండరామ కళ్యాణ మండపంలో గురువారం కోట దుర్గ ఉత్సవాల్లో భాగంగా 15 వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ యజ్ఞకర్త సర్వజోషులు ఎస్‌విఎల్‌ఎన్ శర్మ యాజి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ సేవా సంఘం పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో జామి లక్ష్మీనారాయణ, కోట శంకర్రావు, సుక్క శ్రీనివాసరావు, జన్ని దుర్గారావు, తదితరులు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వెంటనే ప్రారంభించాలి

నెల్లిమర్ల: నగర పంచాయతిలో జగనన్న ఇళ్ల నిర్మాణాలు వెంటనే ప్రారంభించాలని గృహ నిర్మాణ శాఖ పీడీ, మండల ప్రత్యేకాధికారి వి. శ్రీనివాసరావు సూచించారు. గురువారం నగర పంచాయతి పరిధి జరజాపు పేటలో హౌసింగ్ అధికార్లు జగనన్న కాలనీ సందర్శించి ఇంటి నిర్మాణాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతవరకూ నిర్మాణాలు జరపని అర్హులైన లబ్దిదార్లు ఇళ్లు వెంటనే ప్రారంభించాలని సూచించారు. ఇంటి నిర్మాణాలు ప్రారంభించక పోతే రద్దు జరిగే అవకాశం ఉందన్నారు. కాగా నిర్మాణాలు పూర్తి చేసిన ఇళ్లకు బిల్లులు కూడా చెల్లింపులు జరుగుతాయని తెలిపారు. త్వరితగతిన ఇళ్లు నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ ఆర్.పవన్ పాల్గొన్నారు.

సేవా సారథి.. ఎన్ఎస్ఎస్ వారధి

- సామాజిక సేవలో డిగ్రీ విద్యార్థులు
- ప్రజా చైతన్యానికి వాలంటీర్ల కృషి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

విద్యార్థులు చదువుతో పాటు సామాజిక స్పృహ కలిగి ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జాతీయ సేవా పథకం కార్యక్రమాన్ని రూపొందించింది. ప్రతి విద్యార్థీ సామాజిక సేవలో భాగస్వాములుగా ఉంటూ క్షేత్రస్థాయిలో ప్రజలను చైతన్యవంతం చేస్తూ మంచి ఫలితాలను ఇస్తోంది ఈ కార్యక్రమం. ఇందులో భాగంగా గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల ద్వారా గిరిజన గ్రామాల్లో ప్రజలను చైతన్య వంతులుగా తీర్చి దిద్దుతున్నారు. ప్రభుత్వ పథకాలు, పరిసరాల పరిశుభ్రత, వ్యాధులపై అవగాహన, పర్యావరణ పరిరక్షణ వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్య పరిచే దిశగా అడుగులు వేయిస్తున్నారు. రోగులకు, ప్రమాదంలో గాయపడిన వారికి, గర్భిణులకు అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం, విపత్తులు, వరదలు వచ్చినప్పుడు అందులో పాల్గొనేలా చైతన్యపరుస్తూ ప్రజలకు అండగా నిలిచేందుకు ఎన్ఎస్ఎస్ కార్యక్రమం ఉపయోగపడుతోంది.

మూఢనమ్మకాలపై మానవహారం చేపడుతున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

మొక్కలు నాటుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

గిరిజన గ్రామాల్లో సేవలు

జాతీయ సేవా పథకంలో పాల్గొంటున్న విద్యార్థులు ఎస్కెపాడు, జెకెపాడు, ఎల్విన్‌పేట గ్రామాల్లో వివిధ సామాజిక కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరువవుతున్నారు. వారం పాటు ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాలు నిర్వహిస్తూ సేవాస్ఫూర్తి చాటుకుంటున్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ఉన్న కాలువలు, రోడ్లపై చెత్తను, ముళ్ల పొదలను తొలగించి, గ్రామాలను పరిశుభ్రంగా తయారు చేస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య అలవాట్లు, విద్య, వైద్యం వంటి కార్యక్రమాలపై ప్రజలకు వివరిస్తున్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి రక్షించాలని, పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యత గురించి వివరిస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో కలిగే ముప్పును వివరిస్తూ గ్రామాల్లో ఆరోగ్యకరమైన వాతావరణం కల్పిస్తున్నారు. వైద్య శిబిరాలను నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారు. మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.

ప్రజల్లో చైతన్యం

గిరిజన గ్రామాల్లో సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్య పరచడం సంతృప్తిగా ఉంది. ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల్లో భాగస్వాములైనప్పటి నుంచి నాలో సేవా కార్యక్రమాలపై ఆసక్తి పెరిగింది. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేయడానికి ముందుంటాను.

- పి.జీవన్, ఎన్ఎస్ఎస్ కార్యకర్త

వైద్య శిబిరాల నిర్వహణ

ఎన్ఎస్ఎస్ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు సేవలు అందిస్తున్నాం. మరోవైపు మూఢ నమ్మకాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నాం. ఇటువంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉంది.

- ఎం.రేష్మ. ఎన్ఎస్ఎస్ కార్యకర్త

నాయకత్వ లక్షణాలు

విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంచేందుకు ఎన్ఎస్ఎస్ కార్యక్రమం దోహదపడుతుంది. ఈ కార్యక్రమం ద్వారా యువత మంచి మార్గంలో నడవడానికి వీలుంటుంది. ప్రతి ఏడాది క్యాంపులు నిర్వహిస్తున్నాం.

- బి.త్రినాథ్, ఎన్ఎస్ఎస్ పిఒ, డిగ్రీ కళాశాల, గుమ్మలక్ష్మీపురం

ఉత్తమ పౌరులుగా..

విద్యార్థుల్లో సోదరభావం, దేశభక్తి, క్రమశిక్షణ వంటివి ఏర్పడి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి ఎన్ఎస్ఎస్ శిబిరాలు ఎంతగానో ఉపయోగ పడతాయి. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు భవిష్యత్తు తరాలకు మార్గదర్శకులుగా ఎదగాలనే లక్ష్యంతో ఈ శిబిరాలను నిర్వహిస్తున్నాం.

- టి.శ్రీవరం, ప్రిన్సిపల్, డిగ్రీ కళాశాల, గుమ్మలక్ష్మీపురం

ప్రజలకు చేరువలో వైద్య సేవలు

సీతానగరం.. రోగులకు మందులు అందిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

ప్రభుత్వ వైద్య సేవలు ప్రజలకు చేరువ చేయడం జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని క్రిష్ణపల్లి గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష (జెఎఎస్) కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత కల్పిస్తూ సిఎం జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేకమైన పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. వీటి ద్వారా పేదలకు మెరుగైన నాణ్యత కలిగిన సేవలు అందుతాయన్నారు. పెదబొండపల్లి, బందలుప్పి పిహెచ్‌సిల వైద్యులు అనూష, తిరుమల ప్రసాద్ రోగులకు తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోను లక్ష్మి, వైద్యులు ధరణి, ఎంపిహెచ్ఇఒ వెంకటనాయుడు, హెల్త్ సూపర్‌వైజర్ శంకర్రావు, వైసిపి నాయకులు బలగ నాగేశ్వరరావు, బొమ్మి రమేష్, ఎం. చంద్రశేఖర రావు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని ఎల్విన్‌పేట పంచాయతీ జాతపు కోటపాడు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ ఆర్.చైతన్య స్రవంతి ప్రారంభించారు. పంచాయతీ పరిధిలో గ్రామాల్లో గిరిజనులు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలను వినియోగించుకున్నారు. వైద్యులు అభిలాష్ రోగులకు సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పేదవాడికి మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి జగదీష్ కుమార్, సిడిపిఒ సుశీలా దేవి, పంచాయతీ కార్యదర్శి శ్యామల, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాలూరురూరల్ : మండలంలోని కూర్మరాజుపేటలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని డిప్యూటీ డిఎంహెచ్ఒ శివకుమార్ సందర్శించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, వైసిపి మండల అధ్యక్షులు సువ్వాడ భరత్ శ్రీనివాస రావు, కె.తవిటినాయుడు, ఎంపిడిఒ జి.పార్వతి పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని నడుకూరు గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు, డిఎంహెచ్ఒ జగన్నాథరావు సందర్శించారు. సుమారు 350 మందికి వైద్యులు ఉమామహేశ్వరి, మానస, వైవికె రమణ, ఎస్.సింధు, ఎం.రాజేష్‌కుమార్ పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. రక్తహీనత కలిగిన వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డిఎంహెచ్ఒ బి.జగన్నాథరావు వైద్యసిబ్బందిని ఆదేశించారు. రక్తహీనతతో గర్భిణులు, విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. వైద్య తనిఖీలు నిర్వహించి, క్రమం తప్పకుండా ఐరన్ మాత్రలు మింగించాలని సిబ్బందిని ఆదేశించారు. వీటి విషయంలో ఎవరైనా నిర్లక్ష్యం చూపితే వారికి మెమోలు జారీ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి, సూపర్వైజర్లు జనార్దన్‌రావు, ఒ.శాంతికుమారి, సర్పంచ్ కర్రి రమాదేవి, ఎంపిటిసి వై.జయశ్రీ, పిఎసిఎస్ డైరెక్టర్ భోగి లత, మాణిక్య చంద్రశేఖర్, ఎంపిడిఒ వై.వెంకటరమణ, ఐసిడిఎస్ సూపర్వైజర్లు జనార్ధనరావు, శాంతకుమారి, ఎన్.రాజేశ్వరి, సచివాలయ కార్యదర్శి మధు, విఆర్ఒ ఎం.సింహాచలం పాల్గొన్నారు.

వీరఘట్టం.. వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ జగన్నాథరావు

సీతానగరం : అయోడిన్ లోపంతో పిల్లలో మానసిక వృద్ధి, మనోవికాసం లోపిస్తాయని, బుద్ధి మాంద్యం కలిగే అవకాశం ఉందని డిఐఒ టి.జగన్మోహనరావు తెలిపారు. ప్రతిఒక్కరూ అయోడైజ్డ్ ఉప్పునే ఆహార పదార్థాల్లో వినియోగించాలని కోరారు. సీతానగరంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన పర్యవేక్షించి, అక్కడ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ జె.తేరేజమ్మ, జెడ్‌పిటిసి ఎం.బాబూజీ, వైద్యాధికారి కె.శిరీష, నాయకులు జి.సూర్యనారాయణ, ఎస్.కిరణ్‌కుమార్, సూపర్‌వైజర్లు ఎస్‌వి రమణ, జయగౌడ్ పాల్గొన్నారు.

సీతానగరం : పెదబోగిలిలో గురువారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే జోగారావు సందర్శించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బి.కృష్ణమహేశ్ రెడ్డి, ఎంఇఒ జి.సూరిదేవుడు, వైద్యాధికారులు కె.శిరీష, ఉషారాణి, వైసిపి నాయకులు బి.చిట్టిరాజు, జెడ్‌పిటిసి ఎం.బాబ్జి, ఎంపిపి బి.శ్రీరాములునాయుడు, ఎంపిటిసిలు బురిడి సూర్యనారాయణ, ఎస్.కిశోర్ పాల్గొన్నారు.

ఇ-క్రాప్‌లో తప్పుల సవరణకు అవకాశం

పాచిపెంట.. ఇ-క్రాప్ జాబితాను పరిశీలిస్తున్న ఎఒ తిరుపతిరావు

ప్రజాశక్తి-పాచిపెంట

ఇ-క్రాప్‌లో తప్పుల సవరణకు చివరి అవకాశం ఇస్తున్నట్లు ఎఒ కె.తిరుపతిరావు తెలిపారు. మండలంలోని మోసూరు, పాంచాలి, గురివినాయుడుపేట, మాతుమూరు రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించిన ఇ-క్రాప్‌లో నమోదైన రైతుల జాబితాను గురువారం ఆయన పరిశీలించారు. ఇ-క్రాప్ నమోదులో ఏవైనా చిన్న చిన్న తప్పులు దొర్లితే సరి చేసుకోవడానికి ఇదే చివరి అవకాశమని తెలిపారు. రైతుల వివరాలను గ్రామసభలలో చదివి వినిపించడమే కాకుండా రైతు భరోసా కేంద్రాలలో ప్రదర్శించాలని సూచించారు. రైతు గ్రూపులలో వాట్సాప్ ద్వారా తెలియజేయాలని, ఏవైనా అభ్యంతరాలు ఉంటే రాతపూర్వక ఫిర్యాదులను స్వీకరించి, సవరించాలని తెలిపారు. నవంబర్ ఒకటో తేదిన సవరణలు పూర్తయ్యాక తుది జాబితా రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విఎఎలు బాలకృష్ణ, శ్రీను, గణేష్, దినేష్ పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని కె.వెంకటాపురం, జోగింపేట గ్రామాలలో గురువారం ఇ-పంట నమోదు జాబితా ప్రదర్శనను ఎఒ అవినాష్ పరిశీలించారు. రైతులు ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సర్పంచులు బి.శ్రీనివాసరావు, కె.సింహాచలం, వి.ఈశ్వర నారాయణ పాల్గొన్నారు.

ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే

ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న కార్మికులు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలో ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న కాలువలతో పాటు 30 వార్డుల్లో ఉన్న కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. ఇటీవల అకస్మాత్తుగా కురిసిన భారీ వర్షానికి వరదనీరు ప్రధాన రహదారి పక్కన ఉన్న కాలువలో ప్రవహించేందుకు అవకాశం లేకపోవడంతో రోడ్డుపైకి చేరింది. ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయింది. దీంతో మున్సిపల్ ప్రజారోగ్య విభాగం అధికారుల జెసిబి సహాయంతో కాలువలపై ఉన్న పలకలను తొలగించి చూడగా కాలువలో పేరుకు పోయిన వ్యర్థాలు దర్శనమిచ్చాయి. భారీగా పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను జెసిబితో తొలగించి వర్షపునీరు మళ్లించేందుకు చర్యలు చేపట్టారు. ప్రత్యేక పర్యవేక్షణ చేసి ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చి దిద్దాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ప్రజాశక్తి-కొమరాడ

అనుమతులు లేకుండా గురువారం రామభద్రపురం రీచ్ నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ గోపాల్‌కృష్ణ తెలిపారు. వాటిని కొమరాడ స్టేషన్‌కు అప్పగించారు. బిల్లులతో వెళు న్న తమ ట్రాక్టర్లను సీజ్ చేయడం ఎంతవరకు సమంజసమని ట్రాక్టర్ల యజమానులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇసుక రీచ్ వద్ద అమ్మకాలు చేస్తున్న యాజమాన్యంపై కనీసం చర్యలు తీసుకోకుండా, ట్రాక్టర్లపై కేసులు నమోదు చేయడం సరికాదన్నారు.

పట్టుబడిన ట్రాక్టర్

కురుకుట్టిలో ప్రచారం చేస్తున్న టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు జి.సంధ్యారాణి

చంద్రబాబు ముమ్మాటికీ నిర్దోషే

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు జి.సంధ్యారాణి

ప్రజాశక్తి-సాలూరు రూరల్

చంద్రబాబునాయుడు జీవితంలో ఏనాడూ, ఏ తప్పూ చేయరని, 45 రోజులుగా అన్యాయంగా జైల్లో పెట్టారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు జి.సంధ్యారాణి అన్నారు. గురువారం మండలంలో కురుకుట్టిలో బాబుతో నేను కార్యక్రమంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. జీవితంలో నిరంతరం యువత ఉన్నత స్థానంలో ఉండాలనే ఉద్దేశంతో చంద్రబాబు నిరంతరం తపించారని తెలిపారు. అటువంటి వ్యక్తి తప్పు చేశారని ప్రభుత్వం తప్పుడు కేసులు నమోదు చేసి అన్యాయంగా జైల్లో పెట్టారని చెప్పారు. ఆ తప్పుడు కేసుల నుండి కడిగిన ముత్యంలా బయటకు వస్తారన్నారు, అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి చంద్రబాబునాయుడును అన్యాయంగా జైల్లో పెట్టారని వివరిస్తూ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఆముదాల పరమేష్, కూనిశెట్టి భీమారావు, దొర లక్ష్మణ, అక్యానా తిరుపతిరావు, తాడుతూరి తిరుపతిరావు, శ్యామ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టౌన్ సిఐ సిహెచ్.శ్రీనివాసరావు

క్రమశిక్షణే భవిష్యత్తుకు పునాది

టౌన్ సిఐ సిహెచ్.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-సాలూరు

క్రమశిక్షణతో కూడిన విద్య అభ్యసించిన విద్యార్థులే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని టౌన్ సిఐ సిహెచ్.శ్రీనివాసరావు చెప్పారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని శ్రీ సత్యసాయి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలని కోరారు. సెల్‌ఫోన్ వినియోగంపై దృష్టి తగ్గించి విద్యార్థిగా నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించడానికి కృషి చేయాలని కోరారు. అనంతరం మహిళా రక్షణపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్ఐలు పి.నరసింహమూర్తి, ఎన్.భాస్కరరావు, కళాశాల ప్రిన్సిపల్ భాస్కరరావు, రామానుజన్ మేథ్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ రంభ రజనీకాంత్ పాల్గొన్నారు.